క్లుప్తంగా

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



వృద్ధురాలితో మాట్లాడుతున్న నేను సైతం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు శివప్రసాద్

కొయ్యూరు: మండలంలోని బట్టపనుకుల పంచాయతీ లంకవీధికి చెందిన ఇరటా రాములమ్మకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి ఆదేశాల మేరకు నేను సైతం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు శివప్రసాద్ ఆదివారం ఆర్థిక సాయం చేశారు. పేదరికంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఆమెకు శివప్రసాద్ ఒక బియ్యం బస్తాను, రూ.5వేల నగదును, రగ్గు, చీరలు అందజేశారు. అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్న మరికొంతమంది బాధితులను ఆర్థికంగా ఆదుకుంటామని శివప్రసాద్ తెలిపారు. ఎలాంటి అవసరం ఉన్నా తమను సంప్రదించాలని ఆయన వృద్ధురాలిని కోరారు. కినపర్తి, బట్టపనుకుల సర్పంచ్‌లు రీమెల శ్రీనివాస్, దేశగిరి బాలకృష్ణ, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రాజు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రరావు, నాయకులు మల్లిబాబు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వితరణ



బాధిత కుటుంబ సభ్యులకు నగదు ఇస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఎటపాక: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీలోని లింగాలపల్లి గ్రామంలో మృతి చెందిన ఓ బాధిత కుటుంబానికి జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వితరణ అందజేశారు. లింగాలపల్లి గ్రామానికి చెందిన బుల్లెద్దు బాబు అనారోగ్యంతో మృతి చెందారు. సాయం కోసం సమాచారం అందుకున్న జేకే ట్రస్టు నిర్వాహకులు మృతుడి పేద కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు మృతుడి కుటుంబానికి రూ.5వేల నగదును అందజేశారు. కొట్టి వెంకయ్య, మధు, వెంకన్న ,బాబు, నరేష్ ,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

చింతూరు: మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు. చింతూరు, కూనవరం, వీఆర్ పురం , ఎటపాక మండలాల్లో ఏజన్సీ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం కోసం ఈనెల 9,10 తేదీల్లో 48 గంటల పాటు రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. నిర్వాసితుల సమస్యలపై జనవరిలో పాదయాత్ర చేపట్టి ఫిబ్రవరిలో బహిరంగసభ నిర్వహిస్తామని తెలిపారు. దీంతో పాటు 31న పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు వెంకటేశ్వర్లు, చినవీరభద్రం, కృష్ణ, లక్ష్మణరావు, నాగేశ్వరరావు, రాఘవయ్య పాల్గొన్నారు.

రోడ్డు సదుపాయం కల్పించండి

● లుగసరిపుట్టు గ్రామస్తుల విన్నపం

పెదబయలు: మండలంలోని కుంతుర్ల పంచాయతీ లుగసరిపుట్టు గ్రామానికి రహదారి నిర్మించాలని స్థానికులు కోరతున్నారు. నేటికీ గ్రామానికి వెళ్లేందుకు సరైన రహదారి లేదని అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుంతుర్ల పంచాయతీకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని పలుమార్లు అధికారులకు వినతులిచ్చినా మంజూరు చేయలేదన్నారు. 2018లో గ్రామానికి సగం రోడ్డును వేసి వదిలేశారని, వర్షాలకు కోతకు గురైన రహదారి వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు. కాలినడకన వెళ్లాల్సి వస్తోందని, అత్యవసర సేవలైన 108, 104 అంబులెన్స్‌లు, ఏ ఇతర వాహనాలు వచ్చే పరిస్థితి లేదంటున్నారు. గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కాలినడకన వచ్చి విధులు నిర్వర్తిస్తున్నారని చెబుతున్నారు. గ్రామాల్లో రోగులకు డోలీలో కుంతుర్ల వరకు తరలించి, అక్కడి నుంచి వాహనాల్లో ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి గ్రామానికి రహదారి నిర్మించాలని వారు కోరుతున్నారు.

దిగుబడి బాగు.. అమ్మకాల జోరు



పెద్దపుట్టులో వేరుశనగ పంట



వేరుశనగ పంటను తీసుకువస్తున్న గిరిజన మహిళలు

● వేరుశనగకు గిరాకీ
● ఆశాజనకంగా ధరలు
● ఆనందంలో రైతులు

ముంచంగిపుట్టు: గిరిజనులకు వేరుశనగ పంట లాభాలను కురిపిస్తోంది. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వేరుశనగ పంట దిగుబడి రావడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీల్లో 836 మంది రైతులు–1138 ఎకరాల్లో గిరిజనులు వేరుశనగ పంటను వేశారు. ఈ ఏడాది గిరిజన రైతులకు పంట కలిసోచ్చింది. దీనికి తోడు వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం రైతులకు అన్ని విధాలా కలిసి వచ్చినట్లయింది. ప్రస్తుతం పంట చేతికందడంతో గ్రామాల్లో గిరిజనులు వేరుశనగ పంటను సేకరించే పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఇంటిలో వేరుశనగను శుభ్రపరిచి ఎండలో ఎండ బెడుతున్నారు. కొంత మంది వేరుశనగను ఉడకబెట్టి వారపు సంతలకు తీసుకు వెళ్లి విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా సంతలో గ్లాసు రూ.20ల నుంచి రూ.50ల వరకు గిరి రైతులు అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో పాటు పచ్చి వేరుశనగ సైతం బస్తాల లెక్క అమ్మకాలు చేస్తున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు మైదాన ప్రాంతంతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. వేరుశనగను లారీలు, వ్యానులలో తరలిస్తున్నారు. గతంలో బస్తా రూ.300లు ఉండేది ప్రస్తుతం రూ.500లకు పైగా ధర పలుకుతుంది. మంచి దిగుబడితో పాటు ధర కూడా గిరిజన రైతులకు కలిసి వచ్చినట్లయింది. గత నెల రోజులుగా వేరుశనగ అమ్మకాలు ముంచంగిపుట్టు, లక్ష్మీపురం, జోలాపుట్టు, బూసిపుట్టు, బంగారు మెట్ట వారపు సంతల్లో జోరుగా సాగుతున్నాయి. ఆర్థిక ఇబ్బందుల నుంచి వేరుశనగ ఆదుకోవడంతో పాటు లాభాలు సైతం తీసుకోచ్చిందని గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధర బాగుంది



ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్న మాకు వేరుశనగ పంట ఆదుకొంది. దిగుబడితో పాటు మంచి ధర పలకడంతో ఆర్థికంగా కలిసొచ్చింది. అప్పులు చేసి పెట్టుబడి పెట్టాం. ఈ ఏడాది వేరుశనగ దిగుబడి బాగుంది. దీంతో పాటు మార్కెట్లో గిరాకీ ఉంది. లాభాలు బాగా వచ్చాయి. సంతకు తీసుకువెళ్లి అమ్మకాలు చేస్తున్నాం.

– వి.కళ్యాణం, గిరిజన రైతు, జర్రెలపోదర్ గ్రామం, ముంచంగిపుట్టు మండలం

సాగుపై సూచనలు



రైతులకు ఆర్థికంగా లాభాలు పొందే పంటలపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నాం. వేరుశనగ పంటను వేస్తున్న రైతులకు దిగుబడిపై పలు సూచనలిస్తున్నాం. దీంతో పాటు వాణిజ్య పంటల సాగుపై కూడా సూచనలు, సలహాలు ఇస్తున్నాం. దిగుబడితో పాటు ఆర్థికంగా లాభాలు పొందుతున్నారు.

– శ్రీనివాసబాబు, వ్యవసాయ శాఖ అధికారి, ముంచంగిపుట్టు

భక్తిశ్రద్ధలతో కార్తీక అమావాస్య పూజలు



షిర్డీసాయిబాబా ఆలయ ప్రాంగణంలోని శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

రాజవొమ్మంగి: కార్తీక మాసం ముగుస్తున్న సందర్భంగా ఆదివారం, అమావాస్య రోజున మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లిన భక్తులు అరటి డొప్పల్లో నేతితో తడిపిన వొత్తులను వెలిగించి, పసుపు కుంకుమలతో దీపాలను సమర్పించి, పూజలు చేశారు. మండలంలోని జడ్డంగి భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయం, రాజవొమ్మంగి కొండపై గల రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయం, స్థానిక షిర్డీసాయిబాబా, వేంకటేశ్వరసామివారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

నేడు పోలిపాడ్యమి

కార్తీక మాసం చివరి రోజు సోమవారం పోలిపాడ్యమి పర్వదినాన్ని జరుపుకోడానికి గృహిణులు అన్ని ఏర్పాట్లు చేసుకొంటున్నారు. ఈ పండుగ సందర్భంగా భక్తులు వేకువజామునే సమీపంలోని నదులకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అనంతరం 360 ఒత్తులు వెలిగించి అరటి డొప్పల్లో ఉంచి ప్రవహిస్తున్న నదుల్లో వదిలిపెడతారు. అంతకు ముందు కుటుంబసమేతంగా దీపాలకు పసుపు కుంకుమలతో పూజలు చేసి నైవేద్యం సమర్పిస్తారు.

బోరు ఆక్రమణపై ఫిర్యాదు



చేతిపంపును ఆక్రమించి పోసిన మట్టి

ఎటపాక: గ్రామ పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన చేతిబోరును పంచాయతీ ఆక్రమించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని త్రిపురపెంటవీడు గ్రామ పంచాయతీలో 2017లో పంచాయతీ నిధులతో చేతి పంపు ఏర్పాటుకు బోర్ వేయించారు. అయితే ఈ బోరును ప్రస్తుత సర్పంచ్ ఆక్రమించి మట్టితో ప్రదేశాన్ని నింపారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై మండల పరిషత్ అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. గోదావరి వరదల సమయంలో ఈ వీధిలో ఈ చేతి బోరు ఎంతో ఉపయోగకరంగా ఉందని, దీనిని ఆక్రమించడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపి ఆక్రమణ నుంచి చేతి పంపును ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని వేడుకుంటున్నారు.

నాటక రూపకర్త సుబ్బారెడ్డికి నివాళి



నాటక రూపకర్త సుబ్బారెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బాలదేవ్ తదితరులు

అరకులోయటౌన్: నాటక రూపకర్త గాదె సుబ్బారెడ్డి మృతి ప్రజా కళలకు తీరని లోటని ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో సారా వ్యతిరేక కళాజాత ఉద్యమం, అక్షరాస్యత కళాజాత, పుచ్చలపల్లి సుందరయ్య చరిత్ర కళారూపకం, మహాకవి శ్రీశ్రీ శతజయంతి ఉత్సవాలు, వేమన విజ్ఞాన జాత వంటి ముఖ్యమైన కళాజాతలు గెదె సుబ్బారాడ్డి పర్యవేక్షణలోనే ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తృతంగా జరిగాయన్నారు. నాలుగు దశాబ్దాలుగా ప్రజా నాట్యమండలి కళాకారుడిగా, రచయితగా, నాటక రూపకర్తగా అనేక మందిని తీర్చిదిద్దారన్నారు. కళామతల్లికి ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు.ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ సభ్యులు జోషి, కోగేశ్వరరావు పాల్గొన్నారు.

తీరిన కష్టాలు... తప్పిన ప్రమాదాలు



(నేడు)

అప్పలరాజుపేట వద్ద ప్రమాదకర వాగుపై పూర్తయిన కల్వర్టు శ్లాబ్ నిర్మాణం



(నాడు)

కల్వర్టు లేక వాగు ఉధృతి వల్ల నిలిచిపోయిన రాకపోకలు (ఫైల్)

● గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో గ్రామస్తులకు తప్పిన ఇక్కట్లు
● అప్పలరాజుపేటలో ప్రమాదకర వాగుపై కల్వర్టు నిర్మాణం

రాజవొమ్మంగి: వర్షాకాలంలో అతి ప్రమాదకరంగా ప్రవహించే వాగులపై కల్వర్టుల నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రంపచోడవరం డివిజన్‌లో రూ. 2.5 కోట్లు మంజూరు చేసింది. ఆ కల్వర్టుల నిర్మాణనులు గడచిన వర్షాకాలానికే పూర్తయ్యాయి. ఏ మాత్రం వర్షం వచ్చినా వాగులు దాటేందుకు నానా అవస్థలు పడే గిరిజనులు నేడు వంతెనలను తలపిస్తు కల్వర్ట్ పనులు పూర్తికావడంతో సర్వత్రా సంతోషం వ్యక్తమవుతోంది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లు, కల్వర్టులకు కోట్లాది రూపాయలు మంజూరు:

వర్షాకాలంలో పొలం పనులకు వెళ్లిన వారు, అత్యవసర పనులపై పక్క గ్రామం వెళ్లిన వారు గూటికి చేరాలంటే వాగులు పొంగితే నానా ఇబ్బంది పడేవారు. వాగులో ప్రవాహనం తగ్గే వరకు అక్కడే వేచి ఉండి.. ఏ అర్ధరాత్రో.. ఇళ్లకు చేరేవారు. ఈ ఇబ్బందులను గుర్తించిన గిరిజన సంక్షేమ శాఖ రంపచోడవరం డివిజన్‌లో పలు ప్రమాదకర వాగులపై కల్వర్టుల నిర్మాణం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపింది. దీనిపై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం స్పందించి వెంటనే రూ.2.50కోట్లు ఐఏపీ నిధులు మంజూరు చేయడం విశేషం. ప్రమాదకర వాగుల్లో రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేట, అమ్మిరేఖల, కిమ్మిలిగెడ్డ, కొత్తవీధి తదితర గ్రామాలకు వెళ్లే రహదారిపై గల పిసిని కాలువ ఒకటి. పిసిని కాలువపై రూ.25 లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మాణం పూర్తి కావడంతో దాదాపు ఐదు గ్రామాలకు చెందని గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే వాగులు ఉధృత ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయేవని స్థానికులు చెబుతున్నారు. ఇదే తరహాలో లబ్బర్తి రహదారిపై రూ.25లక్షలు, జడ్డంగి నుంచి చిన్నయ్యపాలెం వెళ్లే రహదారిపై రూ.16లక్షలతో, చిన్నయ్యపాలెం నుంచి సింగంపల్లి వెళ్లే రహదారికి వాలుగా గల వాగుకు రూ.16లక్షలతో కల్వర్టుల నిర్మాణం పనులు పూర్తయ్యాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు రహదారి, రవాణా కష్టాలు తీరాయి అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వస్తోందంటే ఎంతో ఆందోళన పడేవారమని, నేడు వంతెనలు పూర్తి కావడంతో ఆ ఇబ్బందులు తొలగాయని ఆయా గ్రామస్తులు చెబుతున్నారు. వర్షాకాలంలో రోడ్డు కోతకు గురవుతున్న స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట రూ.7లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మాణం కూడా గత ఏడాదే పూర్తయ్యింది. ఇవి కాక రంపచోడవరంలో సీమగండి–దారగూడెంల మధ్య రూ. 35లక్షల వ్యయంతో లోలెవెల్ కాజ్‌వే, వై.రామవరం మండలంలో దుంపవలస–బూసికొండ మధ్య రూ.40లక్షలతో హైలెవెల్ బ్రిడ్జ్, వలసరోడ్ జంక్షన్–రవ్వగెడ్డ మధ్య రూ. 40లక్షలతో మరో వంతెన, అడ్డతీగల మండలంలో బొడ్లంక–లోతావారివీధి రోడ్‌పై రూ.20లక్షలతో స్లాబ్ కల్వర్ట్ నిర్మాణాలు పూర్తికాగా రహదారి కష్టాలను గట్టెక్కాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీ బిందెలతో గిరిజన మహిళల ఆందోళన



పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామ మహిళలు

సాక్షి, పాడేరు: తాగునీటి పథకం మోటారు వ్యవస్థ పాడవడంతో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో హుకుంపేట మండలం సంతారి పంచాయతీ కేంద్రంలో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పాలకవర్గంతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు గ్రామస్తులు సమస్యను విన్నవించినా పట్టించుకోకపోవడంతో గ్రామ మహిళలు ఆదివారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. వారం రోజులుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మోటార్‌ను బాగు చేసి తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించని పక్షంలో పాడేరు ఐటీడీఏ ఎదుట ఆందోళన చేస్తామని గిరిజన మహిళలు హెచ్చరించారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



కొత్తసుజనకోటలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రమేష్, నేతలు

ముంచంగిపుట్టు: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నామని సర్పంచ్ వి.రమేష్ అన్నారు. మండలంలో గల సుజనకోట పంచాయతీ కొత్తసుజనకోట గ్రామంలో ఎంపీపీ నిధులు రూ.2.20లక్షలతో 50మీటర్ల సీసీ రోడ్డు పనులకు ఆదివారం సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మీ తదితరులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ కొత్తసుజనకోటలో సీసీ రోడ్డు సమస్యను గ్రామస్తులు గతంలో తీసుకురావడంతో రహదారి మంజూరు చేసి పనులు ప్రారంభించామన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. సీపీఎం నేత గాసిరాందొర, గ్రామస్తులు నాగభూషణం, గణపతి, లక్ష్మణ్, జయరాం, సానదోర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ



కె.కోడాపల్లిలో బాధిత కుటుంబాలకు నగదు, కూరగాయలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

జి.మాడుగుల: గ్యాస్ లీకై పెంకుటిల్లు దగ్ధం సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు బిజెపీ నేతలు ఆదివారం నగదు, బియ్యం, కూరగాయలు వితరణగా అందజేసింది. మండలంలో కె.కోడాపల్లి గ్రామంలో శనివారం జరిగిన గ్యాస్ లీకు సంఘటనలో పెంకుటిల్లు దగ్ధమై బాధిత కుటుంబాల ఇళ్లలోని సర్వం కాలి బూడిదైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లా రామకృష్ణ, బీజేపీ నాయకులు గ్రామాన్ని సందర్శించి అగ్ని ప్రమాద ఇంటిని పరిశీలించారు. ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు నగదు, బియ్యం, కూరగాయలను అందజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ బాధితులు సోమెలి సింహాచలం, భాస్కరరావు కుటుంబాలకు ప్రభుత్వ గృహాలను మంజూరు చేయాలని కోరారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆదుకోవాలన్నారు. మంటల్లో కాలిపోయిన సర్టిఫికెట్లపై అధికారులు చర్యలు చేట్టి కొత్త ధ్రువపత్రాలను జారీ చేయాలని ఆయన కోరారు. నాయకులు గోపాలపాత్రుడు, మత్స్యకొండబాబు, సింహాచలం, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చౌడుపల్లి సర్పంచ్ గెమ్మిలి లలిత

చింతపల్లి: చౌడుపల్లి పంచాయతీ పరిధిలో గల ఈదులబయలు గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ గెమ్మిలి లలిత ప్రారంభించారు. ఆదివారం గ్రామంలో మిషన్ కనెక్టివిటిలో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయంలో రూ.20 లక్షలు నిధులు మంజూరయ్యాయి. అయితే పనులు చేపట్టకపోవడంతో రహదారి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడ్డారు. ఇటీవల సర్పంచ్ లలితతో కలిసి కలెక్టర్ దినేష్‌కుమార్‌ను నిలిచిపోయన రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు చేయాలని, విన్నవించగా ఆయన వెంటనే స్పందించారు. రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో ఆదివారం నుంచి రోడ్డు నిర్మాణ పనులు ప్రాంరభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు గెమ్మిలి సింహాచలం, గ్రామపెద్దలు తదితరులు పనులు పర్యవేక్షించారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



చింతపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది




అడ్డతీగలలో ర్యాలీ నిర్వహిస్తున్న సీహెచ్‌సీ సిబ్బంది

కూనవరం: ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలలో అవగాహన పెరగాలని అప్పుడే దాన్ని నియంత్రించ గలుగుతామని కూనవరం పీహెచ్‌సీ వైద్యాధికారి రాజీవ్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆస్పత్రి నుంచి పాత బస్‌స్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగిఉండాలని సూచించారు. ఇది అంటువ్యాధి కాదని, అంటించుకుంటే సంక్రమించే వ్యాధని అన్నారు. ఎయిడ్స్ రోగులపట్ల సులకన భావం ఉండకూడని, దాని నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించాలని కోరారు. సూపర్‌వైజర్, డీశ్రీనివాస్‌రావు, ఏఎన్‌ఎంలు హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ పండా సతీష్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరికైనా వ్యాధి ఉన్నట్టు భావిస్తే ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేసుకోవచ్చని, అటువంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎయిడ్స్ వ్యాధి సోకినా మానసికంగా భయపడవద్దని మంచి పౌష్టికాహారం తీసుకుని సమయానికి మందులు వేసుకుంటే సంపూర్ణ ఆయిష్షు పొందవచ్చన్నారు. ఎయిడ్స్ వ్యాప్తికి గల కారణాలను వివరించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. సీహెచ్‌సీ వైద్యుడు ప్రసన్నకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలుచోట్ల ఆదివారం భారీ అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. ఎయిడ్స్ వల్ల కలిగే అనర్ధాలను వివరించారు. చింతపల్లిలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఆర్వీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధి ఉద్యోగులు చింతపల్లి ఏరియా ఆసుపత్రి నుంచి హనుమాన్ జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. ఎయిడ్స్‌కు మందులేదని నిరారణే మార్గమని నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కూనవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

శ్రమజీవులపై 'ఫెంగల్' దెబ్బ

● పనులు లేక ఉసూరుమంటున్న వ్యవసాయ కూలీలు



పనుల కోసం వేచి చూస్తున్న కూలీలు

రాజవొమ్మంగి: ముమ్మరంగా వ్యవసాయ పనులు దొరికే సమయంలో 'ఫెంగల్' తుపాను కూలీల పాలిట శాపంగా మారింది. తుపాను కారణంగా ముసురు పట్టడంతో కోతలు, నూర్పిళ్లు తదితర పనులు నిలిచిపోయాయి. దీంతో వ్యవసాయ కూలీలు పనులు లేక ఇబ్బంది పడుతున్నారు. రెక్కాడితేకాని డొక్కాడని అభాగ్యులకు రోజు గడవడానికి సొమ్ములు లేక అల్లాడిపోతున్నారు. మండలవ్యాప్తంగా సుమారు వెయ్యి ఎకరాల్లో వరి కోతలు జరిగాయి. ఇంతలో తుఫాను ప్రభావంతో వర్షం మొదలు కావడంతో పనులు తడిసిపోతున్నాయి. మరో వైపు ఇంకా కోతలు పూర్తి కాని వరి చేలు ఈదురు గాలులకు నేల వాలాయి. మండలంలో ఖరీఫ్ సీజనల్‌లో సుమారు 6వేల ఎకరాల్లో వరి సాగు అయినట్టు అధికారులు చెబుతున్నారు. పంట పక్వానికి వచ్చి కోతలు మొదలయ్యే సమయానికి అకాల వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పనులు లేక శ్రమజీవులు అల్లాడిపోతున్నారు. ఈ వర్షాలు ఆగితే కోత పనుల కోసం ఎదురు చూస్తున్నారు.